క్లుప్తంగా

వరల్డ్ కప్.. సూక్ష్మ రూపం



చైతన్యపురి: బియ్యపు గింజ కన్న చిన్న బంగారు వరల్డ్ కప్ మోడల్‌ను తయారు చేశాడు ఓ సూక్ష్మ కళాకారుడు. దిల్‌సుఖ్‌నగర్‌లో నివసించే చింతోజు జయప్రకాష్ స్వర్ణకార వృత్తిలో ఉన్నాడు. టీమిండియా విశ్వవిజేతగా నిలిచి కప్పు గెలవాలని ఆకాంక్షిస్తూ బంగారంతో అతిచిన్న వరల్డ్ కప్‌ను రూపొందించాడు.

సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



ఎల్‌బీనగర్: ఎన్నికల నేపథ్యంలో ఎల్‌బీనగర్ కౌంటింగ్ కేంద్రమైన సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియాన్ని సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతీ హొలికేరి, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీలు సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ భారతీ హొలికేరి మాట్లాడుతూ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలకు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఎల్‌బీనగర్ రిటరింగ్ అధికారి పంకజ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లను వివరించారు. కలెక్టర్ వెంట పలువురు పోలీసు అధికారులు, ఎల్‌బీనగర్ ఏఆర్‌ఓలు, ఈ ఆర్‌ఓలు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

టీచర్స్‌కాలనీ నూతన కమిటీ ఎన్నిక



హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేజ్–1 సౌత్‌పార్ట్ కాలనీ సంక్షేమ సంఘంతో పాటు కాలనీలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ నూతన కార్యవర్గాన్ని కాలనీ వాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా వల్లపురెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా డి.విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డి.గణేశ్, కోశాధికారిగా జి.బాలక్రిష్ణ ప్రజాపతిని ఎన్నుకున్నారు. ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం కమిటీ చైర్మన్‌గా బి.కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గా ఎం.బుచ్చిరెడ్డి, కోశాధికారిగా జి.మణిపాల్‌రెడ్డిలు ఎన్నికయ్యారు.

కరాటేతో స్వీయరక్షణ



కరాటే మాస్టర్లను సన్మానిస్తున్న విద్యార్థులు

చాంద్రాయణగుట్ట: విద్యార్థి దశ నుంచే కరాటే నేర్చుకోవడం స్వీయరక్షణకు దోహదపడుతుందని నాయక్ బూడోఖాన్ కరాటే అకాడమీ మాస్టర్ పి.గణేష్‌నాయక్ అన్నారు. రాజన్నబావి శివాజీనగర్ సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు కరాటేలో రిఫరీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాస్టర్ గణేష్, బూడోఖాన్ సీనియర్ రిఫరీ శివప్రసాద్ రాజులు విద్యార్థులకు పలు మెళకువలను నేర్పించారు. బీకేఐ గ్రాండ్ మాస్టర్ సి.హనుమంత రావును చూసి విద్యార్థు లు ప్రేరణ పొందాలని సూచించారు. అనంతరం మాస్టర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



సంతోష్‌నగర్: ఎన్నికల సందర్భంగా రౌడీషీటర్లు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూదని సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ సూచించారు. బన్నాకాలోని సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ కార్యాలయంలో సోమవారం ఆయన డివిజన్ పరిధిలోని 36 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రానున్న ఎన్నికల సందర్భంగా రౌడీషీటర్లు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా దూరంగా ఉంటూ సమాజంలో మంచి వ్యక్తులుగా కొనసాగాలన్నారు. ఒకవేళ ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పూసపాటి శివచంద్ర, డీఐ జగన్‌రెడ్డి, ఎస్సై వెంకటేశ్, ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మల్లేష్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



మలక్‌పేట్‌కు నలుగురు ఏఆర్‌ఓలు

- 300 మంది సిబ్బంది
- ఆర్‌ఓ వెంకట ఉపేందర్‌రెడ్డి వెల్లడి



చాదర్‌ఘాట్: మలక్‌పేటలో ఎన్నికల నిర్వహణకు నలుగురు ఏఆర్‌ఓలను నియమించినట్లు నియోజకవర్గం ఆర్‌ఓ వెంకట ఉపేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మలక్‌పేటలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. నలుగురు ఏఆర్‌ఓలతో పాటు 300 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌కు 4ప్లస్1 సిబ్బంది నియామకం చేస్తున్నట్లు తెలిపారు. సైదాబాద్ ఏఆర్‌ఓ జయశ్రీ ఆర్‌ఓ అధికారికి సహాయకురాలుగా పనిచేస్తుందని తెలిపారు. ఏఆర్‌ఓ డీసీ జయంత్ నియోజకవర్గం అధికారులకు భోజనం, వసతి, ట్రాన్స్‌పోర్ట్ వ్యవహారాలు చూస్తారని పేర్కొన్నారు. ఏఆర్‌ఓ మురళీధర్ పోస్టల్ బ్యాలెట్స్ వ్యవహారాలు చూస్తారని, బూత్ లెవల్ సిబ్బందికి తగు శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పిస్తారని తెలిపారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే సస్పెన్షన్

ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, అలసత్వం వహిస్తే సస్పెండ్ చేయాలని ఆదేశాలు వచ్చాయని ఆర్‌ఓ తెలిపారు. అధికారులు ఎవరు కూడా సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరు కావద్దని హెచ్చరించారు.

31లోపు కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చు

ఈనెల 31 లోపు గతంలో ఓటరుగా నమోదు చేసుకోని వారు ఫారం–6 నింపి బీఎల్‌ఓలకు ఇవ్వాలని తెలిపారు. లేదా ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఓటర్ల చైతన్యం కోసం 'రైట్ ఓట్ చాలెంజ్'



వనస్థలిపురంలో రైట్ ఓట్ చాలెంజ్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

వనస్థలిపురం: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పోటాపోటీగా ఓట్లు కొనే నాయకులను, ఓట్లు అమ్ముకునే ఓటర్లను, అసలు ఓటే వేయని ఓటర్లను చైతన్యం చేయడానికి 'రైట్ ఓట్ చాలెంజ్' అనే ఉద్యమ కార్యక్రమానికి వనస్థలిపురంలోని జాగృతి అభ్యుదయ సంఘం శ్రీకారం చుట్టింది. రైట్ ఓట్ ఛాలేంజ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వనస్థలిపురంలో నిర్వహించిన సమావేశానికి జీరో బడ్జెట్ పాలిటిక్స్ కన్వీనర్ పోతిరెడ్డి మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కోట్లు కుమ్మరించిన వారిని కూడా కాదని నిజాయితీ, నిబద్ధతతో ప్రజా సేవ చేసే నాయకులను ప్రజలు కొన్ని ప్రాంతాలలో గెలిపిస్తున్నారని అన్నారు. అటువంటి వారిని ఆదర్శంగా తీసుకుని రాజకీయ పార్టీల అభ్యర్థులు ఈసీ నిబంధనలకు అనుగుణంగా, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల్లో గెలవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వీఆర్‌కే.మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలలో పాల్గొన్న ఏసీపీ భీంరెడ్డి, చైర్మన్ లక్ష్మయ్య

వనస్థలిపురం: వనస్థలిపురం సచివాలయనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవరోజు సోమవారం యాగశాలనందు మూర్తి కుంభవాహన చతుస్థానార్చన, ధ్వజపట అదివాసము, అగ్నిప్రతిష్ఠ, విష్వక్సేన హోమము, గరుడ హోమము, ధ్వజారోహణము, శ్రీవారి కళ్యాణ మహోత్సవం, అన్నప్రసాద వితరణ, తిరువీధి ఉత్సవం, పద్మశ్రీ గరికపాటి నరసింహారావుచే ప్రవచనము కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి, ఆలయ చైర్మన్ కే.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వైస్ చైర్మన్ జగదీశ్‌కుమార్, కోశాధికారి శ్రీధర్, శ్యామల, రామలక్ష్మి, వెంకటేశ్వర్‌రావు, రమేష్‌బాబు, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ షాప్‌లో భారీ అగ్ని ప్రమాదం



హస్తినాపురం: ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్‌తో మంటలంటుకుని వీబీపీ స్పోర్ట్స్ షాపులో బారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి తెలిపిన మేరకు.. పోలీస్‌స్టేషన్ పరిదిలోని రెడ్‌వాటర్ ట్యాంకు దగ్గర ఏర్పాటు చేసిన వీబీపీ స్పోర్ట్స్ షాపులో సోమవారం ఉదయం ఆరున్నర గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా భారీగా ఎగిసిపడుతున్న మంటలను చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్‌లతో మంటలను ఆర్పేందుకు డీఆర్‌ఎఫ్ సిబ్బందితో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో దాదాపు 15 లక్షల రూపాయల వరకు ఆస్తినష్టం జరిగి ఉండవచ్చునని షాప్ నిర్వాహకుడు బిరదర్ సంతోష్ వెల్లడించారు. బాదితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు ప్రజలకు న్యాయం



కొత్తపేటలో నిర్వహించిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్త

నాగోలు: బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల్లో విజయం సాధించి హ్యాట్రిక్ సాధించాలని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. కొత్తపేట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సోమవారం శ్రీలక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ వైభవ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉప్పల శ్రీనివాస్ గుప్త విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ప్రజలందరూ బాగుండాలని, సుఖ సంతోషాలతో జీవించాలని కోరారు. కార్యక్రమంలో సోమిశెట్టి నాగరాజు స్వామి, ప్రెసిడెంట్ శ్రీకాంత్ శేరి పాల్గొన్నారు.

'బెంగళూరు నేతలకు కాంగ్రెస్‌నేతల గులాం'

ఎల్‌బీనగర్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నేతలు బెంగుళూరు నేతలకు గులాములని, బెంగుళూరు నేతలు ఢిల్లీ నేతలకు గులాములుగా మారారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్సీ యెగ్గే మల్లేషం, మాజీ కార్పొరేటర్లతో కలసి సోమవారం ఎల్‌బీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి టిక్కెట్లు అమ్ముకుంటుంటే రేటేంత రెడ్డిగా మారారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ధీమా ప్రతి ఇంటికి ధీమా అని అభ్యర్థులుగా ప్రకటించుకుంటున్నారని తెలిపారు. మాజీ కార్పొరేటర్లు సాగర్‌రెడ్డి, ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, కొప్పుల విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నామినేషన్ దాఖలుకు నూతన కార్యాలయం



చాదర్‌ఘాట్: ఎన్నికల నామినేషన్‌ల దాఖలు దగ్గర పడుతుండటంతో మలక్‌పేటలోని జాతీయ వికలాంగుల పార్కు ప్రాంగణములో దాదాపు రూ.5లక్షలతో నూతన కార్యాలయం నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఉన్న ఆర్‌ఓ కార్యాలయం ఇరుకుగా ఉండటంతో పై అధికారుల ఆదేశాలమేరకు నూతన భవనం ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారులు తెలిపారు. దాంతో కార్యాలయం సమస్య తీరినట్లు అయిందని తెలిపారు.

బీఆర్‌ఎస్ నేతల సంబరాలు



దిల్‌సుఖ్‌నగర్: బీఆర్‌ఎస్ మేనిఫెస్టో తో ప్రతిపక్షాల్లో వణుకు మొదలైందని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మేనిఫెస్టోను విడుదల చేసిన సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్లో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్ ప్రధాన రహదారిపై అరవింద శర్మతో కలిసి టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అరవింద శర్మ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని ప్రవేశపెట్టిన మేనిఫెస్టో తో ప్రజల్లో సంతోషాలు వెలివెత్తుతున్నాయని అన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

చంపాపేట: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఎల్‌బీనగర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను చూడటం వల్లనే తాను బీఆర్‌ఎస్ పార్టీలో చేరానని చంపాపేట మారుతీనగర్‌కు చెందిన రాష్ట్ర టీఎస్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ స్పష్టం చేశారు. సోమవారం చంపాపేటలో జరిగిన ఓకార్యక్రమంలో కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజినేయ స్వామివారి ఆలయ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి ఆధ్వర్యంలో ఆయన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

పాతబస్తీలో మజ్లిస్ పార్టీ సిట్టింగ్‌లకు షాక్?

- అభ్యర్థుల మార్పులపై ఊహాగానాలు
- మార్పులుండొచ్చంటూ ఇప్పటికే ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వెల్లడి
- అభ్యర్థి ఎవరైనా పార్టీ జెండాపై విజయం ఖాయం: మజ్లిస్

చార్మినార్: పాతబస్తీలోని నాలుగు నియోజకవర్గాలకు ఇప్పటికే బీఆర్‌ఎస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించగా.. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కూడా తమ అభ్యర్థులను ప్రకటించింది. ఇక బీజేపీ, మజ్లిస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఇక మజ్లిస్ పార్టీ విషయానికి వస్తే.. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని గోషామహల్ శాసనసభ నియోజకవర్గం తప్పా.. మిగిలిన ఆరు శాసనసభ నియోజకవర్గాలు మజ్లిస్ పార్టీకి కంచుకోటగా ఉన్నాయి.

- ఈసారి జరిగే ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు స్థానాలలో గోషామహల్ నియోజకవర్గం తప్పా.. మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు షాక్ తగలనున్నట్లు తెలుస్తోంది.
- మజ్లిస్ పార్టీ సిట్టింగ్ అభ్యర్థుల నియోజకవర్గాల మార్పు ఉంటుందని ఇప్పటికే ఒకానొక సందర్భంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు.
- అభ్యర్థుల ఎంపిక తన చేతుల్లో లేదని.. అంతా అల్లా చూసుకుంటాడని ఆయన అన్నారు.
- అసదుద్దీన్ ఒవైసీ స్వయంగా అభ్యర్థుల మార్పు ఉంటుందని చెప్పడంతో పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఆలోచనలో పడ్డారు.
- నియోజకవర్గం మారితే ఫర్వాలేదని.. మొత్తానికే టికెట్ లభించక పోతే ఎలా..? అంటూ ఇప్పటి నుంచే ఆందోళనకు గురవుతున్నారు.

మరోసారి మీ ఆశీర్వాదాలు కావాలి



మంత్రి సబితా ఇంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న చిత్రలేవుట్ కాలనీ వాసులు

మంత్రి సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని, రాష్ట్రంలో పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి మరోసారి బి.ఫామ్ అందుకొని మొదటి సారిగా అర్‌కేపురం డివిజన్ చిత్రా లేఔట్ వస్తున్న సందర్భంగా సోమవారం రాత్రి కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీ వాసులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో 2014 కు ముందు రాష్ట్రం ఏవిధంగా ఉండేదో ఇపుడు ఎలా మారిందో చూడవచ్చన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా అవకాశం కల్పించారని మరో సారి మీ అందరి ఆశీర్వాదాలు కావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, చిత్రలేవుట్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు నగేష్ పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం

చార్మినార్: డాక్టర్ అబ్దుల్ కలాం చూపిన బాటలో నడవాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి పీఎస్ నంద అన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పాతబస్తీకి చెందిన విద్యావేత్త జక్కుల విజ్ఞతకు డాక్టర్ అబ్దుల్ కలాం స్మారక అవార్డు–2023ను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్, సంఘసేవకులు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ పాల్గొన్నారు.



విజ్ఞతకు అవార్డు ప్రదానం చేస్తున్న న్యాయమూర్తి

చాంద్రాయణగుట్ట అభ్యర్థిని మార్చాలి



పర్వతాల రాజేందర్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా ఎలాంటి అనుభవం లేని వ్యక్తిని ప్రకటించడం సరైంది కాదని టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి, సీటు ఆశావహుడు పర్వతాల రాజేందర్ అన్నారు. 36 ఏళ్ల నుంచి పార్టీ కోసం జీవితాన్ని ఫణంగా పెట్టిన తనకు టికెట్ ఇవ్వాలని కోరుతూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు సోమవారం ఆయన వేర్వేరుగా రిజిష్టర్ పోస్ట్ చేశారు. పార్టీని బలోపేతం చేసేందుకు తాను చేసిన సేవలను గుర్తించాలన్నారు.

ఆధ్యాత్మిక శోభ

అమ్మవారిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, సునీల్‌రెడ్డి



జీవన్‌జ్యోతి సంఘంలో అన్నదానం ఏర్పాటు చేసిన మార్కెట్ వైస్‌చైర్మన్ భూమేష్





శ్రీగాయత్రీ దేవిగా దర్శనమిచ్చిన జయదుర్గా మాత



ఆలయంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అమ్మవారి ఆలయాలు, మండపాల వద్ద అత్యంత భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలో కొలువుతీరుతున్న అమ్మవార్లను ప్రముఖులు దర్శించుకోవడం, మహిళలు సామూహిక పూజల్లో పాల్గొనడం, ప్రత్యేక అర్చనలు, అన్నదానాలతో ఆలయాలు కోలాహలంగా మారుతున్నాయి. వేడుకల్లో రెండో రోజు సైదాబాద్ మాతామైదాన్‌లో బాలత్రిపుర సుందరి అలంకరణలో విజయదుర్గా మాతా కొలువుదీరగా, జీవన్‌జ్యోతి సంఘంలోని జయదుర్గా మాతా సోమవారం శ్రీగాయిత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మాతామైదాన్ ఆలయంలో అమ్మవారిని నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, ఆలయ కమిటి సభ్యుడు అర్జం సునీల్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. – సైదాబాద్



పల్టాన్‌లో..



మలక్‌పేట హరిహర క్షేత్రములో..



మూసారంబాగ్ రాజరాజేశ్వరి ఆలయంలో..